క్లుప్తంగా

పంటల సాగుపై అవగాహన కలిగి ఉండాలి



పుల్లేటికుర్రులో రావేప్ విద్యార్థులు చిత్రీకరించిన గ్రామ మ్యాప్‌ను పరిశీలిస్తున్న నందకిషోర్, రైతులు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో పండించే పంటల సాగుపై ప్రతి రైతు అవగాహన కలిగి ఉంటే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ ఎం.నందకిషోర్ తెలిపారు. రాజమహేంద్రవరం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం, వ్యవసాయ కళాశాల రావేప్ విద్యార్థులతో పుల్లేటికుర్రులో భాగస్వామ్య గ్రామీణ విశ్లేషణ కార్యక్రమాన్ని సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. రావేప్ విద్యార్థులు గ్రామ పరిస్థితులపై చిత్రపటాలను, గ్రామ మ్యాప్‌ను రూపొందించారు. ఈ మ్యాప్ ఆధారంగా పంటల సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ దక్షిణామూర్తి, ఏఈఓ జాబేజ్‌శాస్త్రి, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్లస్టర్ సమావేశాలు



రామేశ్వరం క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

సఖినేటిపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో శనివారం మండలంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు క్లస్టర్ సమావేశాలు విద్యాశాఖ ఏర్పాటు చేసింది. మండల వ్యాప్తంగా ఉన్న 63 ప్రాథమిక, 15 ఉన్నత పాఠశాలలకు గాను అంతర్వేదికర, సఖినేటిపల్లి, రామేశ్వరం, మోరి క్లస్టర్లలో ఈ సమావేశాలను అధికారులు నిర్వహించారు. ఈ మేరకు రామేశ్వరం క్లస్టర్ సమావేశాన్ని జిల్లా సమగ్ర శిక్ష అధికారి బి.సుబ్రహ్మణ్యం, ఎంఈవో-1 డి.కిషోర్‌కుమార్ సందర్శించారు. టీచర్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎమ్)ను పరిశీలించారు. అలాగే నాణ్యమైన విద్యను అందించే విషయంలో వారికి తగు సూచనలు చేశారు. క్లస్టర్ హెచ్ఎం ఏడుకొండలు, ఆయా గెజిటెడ్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలకు అనుగుణంగా బోధన



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈఓ మనోహరం

రాజోలు: విద్యార్థులకు మారిన పాఠ్యపుస్తకాలకు అనుగుణంగా బోధన చేయాలని ఎంఈఓ నల్లి మనోహరం అన్నారు. శనివారం రాజోలు బాలుర ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. రాజోలు, కడలి, పొన్నమండ కాంప్లెక్స్ కేంద్రాలకు చెందిన ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు. పాఠ్యబోధనలకు సంబంధించిన యాప్స్ గురించి వివరించారు. పలువురు ఉపాధ్యాయులు తయారు చేసిన టీచర్ లెర్నింగ్ మెటీరియల్‌ను శిక్షణ తరగతుల్లో ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయిని కె.సరస్వతి, కాంప్లెక్స్ కార్యదర్శి డి.సత్యనారాయణ, రిసోర్స్‌పర్సన్ గటిగంటి శ్రీనివాస్, య.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మై భారత్ కోనసీమ క్రీడా పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ సాయిబాబు

రాజోలు: మై భారత్ కోనసీమ క్రీడా పోటీలు రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించారు. మై భారత్ యువజన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు రన్నింగ్, వాలీబాల్, కబడ్డీ తదితర పోటీలను నిర్వహించారు. వ్యాయామ అధ్యాపకుడు మధుకుమార్ పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ప్రిన్సిపాల్ పి.సాయిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ పాల్గొన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్‌కు బానిస కాకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.శాంతకుమారి, మై భారత్ వలంటీర్ ఫణీంద్ర, అధ్యాపకులు కె.రాజాబాబు, నల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాలతో కళ్లు తెరిపిద్దాం

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు



గొల్లపాలెంలో సంతకాల సేకరిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు



పాశర్లపూడిలంకలో సంతకాలు సేకరిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

మలికిపురం: ప్రభుత్వం మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలతో కూటమి సర్కారు కళ్లు తెరిపిద్దామని మాజీ మంత్రి, రాజోలు కోఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురం మండలం గొల్లపాలెం, తూర్పుపాలెం గ్రామాల్లో శనివారం మాజీ సీఎం జగన్ పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ రచ్చబండ గ్రామ సభలు జరిగాయి. సూర్యారావు పాల్గొని భారీ ఎత్తున ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. అనంతరం మండల శాఖ పార్టీ అధ్యక్షులు అడబాల వీర బ్రహ్మాజీ అధ్యక్షతన జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వలన పేద మధ్యతరగతి విద్యార్థులు, తల్లిదండ్రులు ఏమి కోల్పోతారో గ్రామస్తులకు వివరించారు. విద్య వైద్యం ప్రతి ఒక్కరి హక్కు, ప్రతి కార్యకర్త ఈ విషయాలు ప్రజలకు తెలియపరచాలని సూచించారు. కార్యక్రమంలో మలికిపురం జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి నేతల నాని, గుబ్బల రోజారమణి, గుర్రం జాషువా, జిల్లెళ్ళ ఉదయ్‌కిరణ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు తాడి కాశి, ఉపాధ్యక్షుడు పితాని శ్రీనివాసరావు, కందుల విజయ్ కుమార్, నాగళ్ళ శివాజీ, గుండుమేను సత్యనారాయణ, నారాయణమూర్తి, తాడి ఈశ్వరరావు, వడ్డీ కుమార్, నల్లి ప్రకాష్, గంట అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కనువిప్పు కలిగిద్దాం

మామిడికుదురు: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ కోటి సంతకాలు సేకరించి కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగిద్దామని పి.గన్నవరం నియోజకవర్గం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రచ్చబండలో భాగంగా శనివారం పాశర్లపూడిలంక, లూటుకుర్రు గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం పంతాలకు, పట్టింపులకు పోతుందన్నారు. తమ అనుయాయులకు ప్రభుత్వ కాలేజీలను ధారాదత్తం చేసేందుకు కూటమి నేతలు శత విధాలా ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చి ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాసరాజు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పార్టీ నేతలు మందపాటి కిరణ్‌కుమార్, పాలమూరి విక్రమ్, అడబాల చక్రపాణి, మట్టపర్తి శివ, బాలం రమేష్, ముత్యాల బాబులు, యల్లమెల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కరవాకలో..

ప్రజల భాగస్వామ్యంతోనే ప్రైవేటీకరణను అడ్డుకుంటామని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. కరవాకలో శనివారం రచ్చబండలో భాగంగా కోటి సంతకాల సేకరణ జరిగింది. విద్య, వైద్యం ప్రతి ఒక్కరి హక్కు అని వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడం వల్ల విద్యార్థులు, పేరెంట్స్ తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోటి సంతకాల సేకరణ ద్వారా ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకుందామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బళ్ల ప్రసన్నకుమారి, కటకంశెట్టి ఆదిత్య, తాడి సహదేవ్, బొలిశెట్టి భగవాన్, గుబ్బల రమేష్, ఉచ్చుల విష్ణు, మోకా సురేష్, ఎండీవై షరీఫ్, చింతా ప్రసాద్, సర్పంచ్ రేకాడి సత్యనారాయణ, ఎంపీటీసీ మల్లాడి వడ్డికాసులు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయదారులు లైసెన్స్‌లు తీసుకోవాలి

అంబాజీపేట: బాణసంచా విక్రయదారులు తాత్కాలిక లైసెన్స్ తీసుకోవాలని తహసీల్దార్ బి.చినబాబు శనివారం తెలిపారు. అంబాజీపేట మండలంలో బాణసంచా విక్రయానికి సంబంధించి తాత్కాలిక లైసెన్స్‌లకు 22 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో 13, ముక్కామల జెడ్పీ హైస్కూల్‌లో 3 షాపులకు దరఖాస్తులు వచ్చాయన్నారు. అలాగే ఏటా పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించే బాణసంచా విక్రయ షాపులకు పర్మిషన్ ఇవ్వలేదన్నారు. దీని స్థానే ఇరుసుమండలో ఉన్న లే ఆవుట్‌లోకి మార్పు చేశామని అక్కడ 6 షాపులకు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. నిబంధనలకు అనుగుణంగా బాణసంచా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు సేల్స్ ట్యాక్స్, అగ్నిమాపక, పోలీసులు, పంచాయతీ నుంచి అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. అనుమతి, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అయినవిల్లి: ఎవరు పడితే వాళ్లు బాణసంచా అమ్మకాలను జరపకూడదని ప్రభుత్వ అనుమతులు తీసుకుని బాణసంచా అమ్మకాలు నిబంధనలు పాటించే వారే బాణసంచా అమ్మకాలను కొనసాగించవచ్చని స్థానిక తహసీల్దార్ సీహెచ్ విద్యాపతి అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 11 బాణసంచా దుకాణాలకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. బాణసంచా దుకాణాల వద్ద ఇసుక బస్తాలు, నీటి ట్యాంకులు, ఫైర్ భద్రత పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే జననివాస ప్రాంతాలు కాకుండా దూర ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

నకిలీ మద్యం అరికట్టేందుకు ఎక్సైజ్ సురక్షా యాప్



కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ కాత్యాయని

కొత్తపేట: నకిలీ మద్యం తయారీ, విక్రయాలు అరికట్టేందుకు 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.కాత్యాయని తెలిపారు. శనివారం సీఐ స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. సెల్ ఫోన్‌లో ఉండే క్యూర్ కోడ్ స్కానర్‌తో మద్యం బాటిల్‌పై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే మద్యం బాటిల్ పూర్తి డిటైల్స్ అంటే బ్రాండ్ పేరు, లైసెన్స్, తయారీ స్థలం తదితర వివరాలు వస్తాయన్నారు. ఆ మద్యం బాటిల్ నకిలీది అయితే చట్టబద్ధమైన హెచ్చరిక మెసేజ్ వస్తుందని, డిటైల్స్ నాట్ ఫౌండ్ అని వస్తుందని, దానిని నకిలీ మద్యంగా అర్థం చేసుకోవాలన్నారు. ఆ యాప్‌లో సమాచారం రాష్ట్ర స్థాయి అధికారులకు చేరుతుందని, వినియోగదారుడు ఎక్సైజ్ అధికారులకు పిర్యాదు చేయవచ్చని సీఐ స్పష్టం చేశారు. అమ్మకందారుడు యాప్ ద్వారానే ప్రతి మద్యం అమ్మకాలు సాగించాలని సూచించారు. బెల్ట్ షాపు రహితంగా మద్యం విక్రయాలకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. లైసెన్స్ షాపు వద్ద తప్ప మరే ఇతర ప్రదేశాల్లో మద్యం అమ్మరాదని హెచ్చరించారు. కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, పి.గన్నవరం మండలాల్లో మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర ప్రదేశాల్లో (బెల్ట్‌షాపు) మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నా, సారా తయారు. విక్రయాలు సాగిస్తున్నా ఆ సమాచారం ఎక్సైజ్ అధికారులకు 9440902423, 9494187189 సెల్ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పాఠశాల స్థాయి చెకుముకి పోటీలు



మలికిపురంలో చెకుముకి పోటీలకు హాజరైన విద్యార్థులు



మామిడికుదురులో నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్ట్

మలికిపురం: జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు మండలంలోని వివిధ పాఠశాలల్లో శనివారం నిర్వహించారు.నాలుగు స్థాయిల్లో నిర్వహించబడుతున్న వాటిలో భాగంగా మొదటి స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, కరెస్పాండెంట్స్, ఉపాధ్యాయులు హాజరయ్యారు. మొత్తం 13 ప్రభుత్వ, 8 ప్రైవేటు పాఠశాలల్లో 1374 మంది 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా చెకుముకి సంబరాల్లో పాల్గొన్నారు.

చెకుముకి టెస్ట్‌కు 1072 మంది హాజరు

మామిడికుదురు:జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో శనివారం చెకుముకి టాలెంట్ టెస్ట్ జరిగింది. మండలంలోని 12 జెడ్పీహెచ్ స్కూల్స్, అయిదు ప్రైవేట్ స్కూల్స్‌కు చెందిన 1072 మంది విద్యార్థులు ఈ టెస్ట్‌లో పాల్గొన్నారు. మండల జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి సూరుమేను శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహించారు. నవంబర్ 1న మండల స్థాయిలో టాలెంట్ టెస్ట్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ప్రకృతిని, పరిసరాలను పరిరక్షిద్దాం

అయినవిల్లి: ప్రకృతిని పరిరక్షిద్దాం.. పరిసరాల పరిశుభ్రతను పాటిద్దాం, అని పోతుకుర్రు సర్పంచ్ సయ్యపరాజు సుబ్బలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పోతుకుర్రు పంచాయతీ వద్ద పంచాయతీ సిబ్బంది, దీవెన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు. సర్పంచ్ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ చెత్తను బుట్టలో వేసి శుభ్రతకు తోడ్పడాలన్నారు. ప్లాస్టిక్ నిర్మూలించి ప్రకృతిని పరి రక్షిద్దామన్నారు. గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణాన్ని కాపాడితే, అది ప్రజలను కాపాడుతుందన్నారు. కాలుష్యంపై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని దీవెన ఫౌండేషన్ చైర్మన్ గుమ్మళ్ల శ్రీనివాస్ సాగర్ పేర్కొన్నారు. అనంతరం పంచాయతీ పరిధిలోని పలు గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మద్దెల రామకృష్ణ, పి.వెంకన్న బాబు, సీహెచ్ త్రిమూర్తులు, సీహెచ్ సత్యనారాయణ మూర్తి, పంచాయతీ సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు, సభ్యులు ఉపాధి హామీ పథకం సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయాలకు భక్తుల తాకిడి



నల్లచెరువు వేంకటేశ్వరస్వామి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసియున్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలకు శనివారం భక్తుల తాకిడి అధికమైంది. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాలను సందర్శించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



అంతర్వేదిలో అర్చకులు, వేదపండితులు నిర్వహిస్తున్న స్వామి కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం ఆర్జిత సేవగా స్వామి వారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలతోను, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు పెద్దింటి వెంకట శ్రీనివాస్, వేద పండితులు ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామి మూలవిరాట్టు దర్శనం దేవస్థానం కల్పించింది. అలాగే లడ్డూ ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం దేవస్థానం ఏర్పాటు చేసింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ పి.విజయసారథి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఫుడ్ పాయిజన్ బాధితులకు పరామర్శ



అంబాజీపేటలో బాధితులను పరామర్శిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

అంబాజీపేట: మాచవరానికి చెందిన 22 మంది బుధవారం ఫుడ్ పాయిజన్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, పాముల రాజేశ్వరిదేవి శనివారం పరామర్శించారు. పేరు పేరున బాధితులను పరామర్శించి జరిగిన సంఘటనపై అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుంటారని వారికి మనోధైర్యం కల్పించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీ మట్టా పార్వతి, బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి హరి, కొర్లపాటి కోటబాబు, కుసుమ శ్రీనివాస్, గోసంగి కుమారస్వామి, మట్టపర్తి యజ్ఞశ్రీ పరామర్శించిన వారిలో ఉన్నారు.

'స్వచ్ఛమైన గాలి' తో మానసిక ప్రశాంతత

కొత్తపేట: స్వచ్ఛమైన గాలితో మానసిక ప్రశాంతత కలుగుతుందని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అన్నారు. 3వ శనివారం, థీమ్ 'స్వచ్ఛమైన గాలి' కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ డీసీహెచ్ పాపారావు ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి పొందాలంటే ప్రకృతికి సమీపంలో ఉండాలన్నారు. మొక్కలు పెంచడం, కాలుష్యాన్ని తగ్గించడం, శుభ్రమైన వాతావరణం వంటి వాటి ద్వారా స్వచ్ఛమైన గాలి వీస్తుందని, తద్వారా మనిషి ఊపిరితిత్తులు శుభ్రం అవుతాయని, ఆరోగ్యకరమైన నిద్ర పడుతుందని, మానసిక స్థితి మెరుగవుతుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందుగా కళాశాలలో పై అంశాలపై ప్రతిజ్ఞ చేశారు.

గ్రీన్ దీపావళిని ఆనందంగా జరుపుకొందాం



పాశర్లపూడిలో అవగాహన కల్పిస్తూ బ్యానర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మామిడికుదురు: గ్రీన్ దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని పాశర్లపూడి జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం కేవీఎస్ నాగోజీరావు సూచించారు. దీపావళి సందర్భంగా శనివారం విద్యార్థులు మట్టి ప్రమిదలను ప్రదర్శించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులు సూరుమేనే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హరిత దీపావళి కార్యక్రమాన్ని నిర్వహించారు. నేడు భూ ప్రపంచం పలు రకాల కాలుష్యాలతో పర్యావరణ సర్వనాశనం అవుతుందన్నారు. మానవుడే ఈ ప్రకృతి వినాశనానికి కారకుడని చెప్పారు. బాణసంచా, క్రాకర్స్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. దీనిపై అవగాహన కల్పిస్తూ బ్యానర్లు ప్రదర్శించారు. ర్యాలీ జరిపారు. చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేశారు. నగరం ప్రధాన మోడల్ స్కూల్లో విద్యార్థులు బాణసంచా కాల్చి ముందస్తు దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం బావిశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఎంఈఓ మోకా వెంకన్నబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం వెంకటరమణ

మామిడికుదురు: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే ఉల్లాస్ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని డీఆర్‌డీఏ ఏపీఎం విప్పర్తి వెంకటరమణ తెలిపారు. మండల వెలుగు కార్యాలయంలో శనివారం ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు రెండు రోజులు శిక్షణ కార్యక్రమం శనివారం జరిగింది. ప్రాథమిక, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతతో పాటు ఆరోగ్య సంరక్షణ అవగాహన, కుటుంబ సంక్షేమం, జీవన నైపుణ్యాల ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం తదితర అంశాలపై 200 మంది మహిళలకు అవగాహన కల్పించారు. నిరంతర విద్యను ప్రోత్సహించడే ఉల్లాస్ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సీసీలు దుర్గం నాగమణి, ఆనందబాబు, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు బి.మల్లిక, బి.తులసీదేవి, రామలక్ష్మి, నాగార్జున పాల్గొన్నారు.

'గౌడ' కులానికి ఎమ్మెల్యే వసంత క్షమాపణ చెప్పాలి



మెర్లపాలెంలో వసంతకు వ్యతిరేకంగా నినదిస్తున్న ఎంపీపీ గంగాధరరావు, రంగారావు గౌడ్ తదితరులు

కొత్తపేట: గౌడ కుల వృత్తిని కించపరుస్తూ మాట్లాడిన కృష్ణా జిల్లా మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గౌడ కులానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని రాష్ట్ర గౌడ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఒక న్యూస్ చానల్‌తో మాట్లాడుతూ గౌడ కుల వృత్తిని, తమ సంఘీయుడు, మాజీ మంత్రి జోగి రమేష్‌ను కించపరుస్తూ వ్యాఖ్యానించారంటూ కొత్తపేట నియోజకవర్గానికి చెందిన గౌడ నాయకులు తీవ్రంగా ఖండించారు.

ఆత్రేయపురం మండలం మెర్లపాలెంలో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద కొత్తపేట ఎంపీపీ, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మార్గన గంగాధరరావు, జై గౌడ్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రంగారావుగౌడ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణగౌడ్ తదితరులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ గౌడ వర్గీయులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై దాడి మరువక ముందే బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తూ, బీసీల తరపున ప్రశ్నించే గొంతుగా ఉన్న మాజీ మంత్రి జోగి రమేష్‌పై నిరాధార కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తుందన్నారు. జోగి రమేష్‌కు మీలా ధన బలం లేకపోవచ్చుగాని మాలాంటి అన్నదమ్ముల రూపంలో జనబలం ఉందని హెచ్చరించారు. కల్లు అమ్మడం మా కుల వృత్తి అని, కల్లు అమ్మేవాడు ఎప్పటికీ అలాగే ఉండాలా? రాజ్యాధికారం సాధించే దిశగా ఎదగకూడదా? అని ప్రశ్నించారు. మా కుల వృత్తి చేసుకుంటూ గౌరవంగా బతుకుతున్నాం. మీలా కబ్జాలు, దందాలు చేయడం లేదు.. అని వసంతను విమర్శించారు. బీసీలకు రాజ్యాధికారం రాకుండా అణగదొక్కాలని చూస్తున్న ఈ ప్రభుత్వానికి, మా కులాన్ని కించపరచిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు వచ్చే ఎన్నికల్లో రాజకీయ సమాధి కట్టబోతున్నామని హెచ్చరించారు. అనంతరం వసంత చిత్రపటాలకు నిప్పు పెట్టారు. సమావేశంలో రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం గౌడ్, వెంకన్నగౌడ్, సూరయ్యగౌడ్, అంగర కిషోర్, మట్టా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నరేష్ కుటుంబానికి ఆర్థిక సాయం



పెట్టా నరేష్ కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న దళిత ఐక్య సంఘం నాయకులు

అయినవిల్లి: మండలంలోని కొండుకుదురు పంచాయతీ కొండుకుదురులంక జాతీయ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఇటీవల అకాల మృతి చెందిన పెట్టా నరేష్‌కు దళిత ఐక్య సంఘం నాయకులు చేయూత నందించారు. శనివారం సంఘం తరఫున రూ.75 వేలు మృతుడు పిల్లల పేరున బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మరో రూ.25 వేలు కుటుంబ సభ్యులకు ఖర్చుల నిమిత్తం అందజేశారు. ముమ్మిడివరం మండలంలోని కమిని, శాణేల్లంక, అయినవిల్లి మండలంలోని కొండుకుదురు, పొట్టిలంక గ్రామాల్లో దళిత సంఘ సభ్యుల నుంచి వసూలు చేశారు. సంఘ ప్రధాన అధ్యక్షులు గుర్రాల రాంబాబు మాట్లాడుతూ ఇంకా ఇటువంటి స్థితిలో ఉన్న కుటుంబాలకు సహాయ కార్యక్రమాలు చేపట్టేందుకు సంఘ సభ్యులు ఎప్పుడు ముందుంటారన్నారు. కార్యక్రమంలో లంక గ్రామాల దళిత అభివృద్ధి సంఘం ఉపాధ్యక్షులు నల్ల రాంజీ అరుణ్‌కుమార్, పోతుల హేమసుందర నారాయణరావు, జనరల్ సెక్రటరీ నక్కా శ్రీనివాసు, సెక్రటరీలు గుత్తాల వరప్రసాద్, కర్రి రాంబాబు, ప్రధాన కార్యదర్శిలు, కార్యదర్శులు గ్రూపు సభ్యులు తదితరులు ఉన్నారు.

వైభవంగా గరుడసేవ

ఆలమూరు: స్థానిక శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయంలో ధన త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి నిర్వహించిన గరుడ సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ కమిటీ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఈఓ బి.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కేవీఎస్ ప్రభాకరాచార్యులు మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలను పల్లకీలో ఉంచి అత్యంత భక్తిశ్రద్ధలతో గరుడసేవ నిర్వహించారు.

పరిసరాలను ఆరోగ్యకరంగా ఉంచుదాం



మండల పరిషత్ కార్యాలయం వద్ద అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ విద్యాపతి తదితరులు

అయినవిల్లి: పరిసరాలను పరిశుభ్రతగా ఉంచి ఆరోగ్యాన్ని కాపాడుకుందామని, వ్యాధులు లేని సమాజాన్ని సృష్టించుకుందామని మండల తహసీల్దార్ సీహెచ్ విద్యాపతి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద అధికారులతో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్రలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. రోడ్ల వెంబడి చెత్తను విచ్చలవిడిగా చెత్తను వేయవద్దని ప్రభుత్వం అందించిన చెత్త బుట్టలు, చెత్తకుండీల్లో మాత్రమే చెత్తను వేయాలని అవగాహన కల్పించారు.